ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

ఆదివారం 17 ఆగస్టు 2025

గజ్వేల్ రేక్ పాయింట్‌ను

పునరుద్ధరించాలి

7

ఇక్కడి యూరియా కోటాను హుస్నాబాద్‌కు మళ్లించారు

సరిపడా అందించకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తాం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



చెరువుల చెంత

జర పైలం

7

ఈత సరదా కారాదు విషాదం

లైఫ్ జాకెట్‌లు వాడటం ఉత్తమం

ఒంటరిగా ఈతకు వెళ్లకూడదు

కృష్ణాష్టమి వేడుకల్లో జగ్గారెడ్డి జోష్

భార్య నిర్మల, కూతురు జయారెడ్డి, కొడుకు దత్తు, స్థానికులతో కలిసి రాంమందిర్ వద్ద ఉట్టికొట్టిన జగ్గారెడ్డి



సంగారెడ్డి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకొని సంగారెడ్డి రాంమందిర్ కమాన్ వద్ద శనివారం రాత్రి జరిగిన వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ముందుగా రాంమందిర్ నుంచి కమాన్ వరకు ఊరేగింపు నిర్వహించారు. కమాన్ వద్ద తన సతీమణి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కూతురు జయారెడ్డి, కొడుకు దత్తుసాయి రెడ్డి, బంధువులు, స్థానికులతో కలిసి ఉత్సాహంగా జగ్గారెడ్డి ఉట్టికొట్టారు. డీజే పాటల నడుమ డ్యాన్సులతో ఆకట్టుకున్నారు.





ప్రహరీలు లేక

పరేషాన్

సర్కారు బడులకు రక్షణ కరువు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, టీచర్లు

పట్టింపులేక ఆక్రమణల పర్వం



ప్రహరీ లేని సంగారెడ్డి బాబానగర్‌లోని ప్రాథమిక పాఠశాల

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను బలోపేతానికి కృషి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా వసతుల కల్పనపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని సంజీవనగర్‌తో పాటు బాబానగర్(పోలీస్‌లైన్)లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు రక్షణ కరువైంది. ఫలితంగా విద్యార్థులు భయం భయంగా తరగతులకు హాజరవుతున్నారు. ప్రహరీలు లేకపోవడంతో పాఠశాలలోని విలువైన సామగ్రి, రికార్డులకు రక్షణ లేకపోతోంది. పశువులు, పురుగుపుట్ర వస్తుండటంతో తరగతుల నిర్వహణకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. మధ్యాహ్న భోజన సమయాల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో విద్యార్థులు కడుపునిండా భోజనం చేయలేని పరిస్థితి నెలకొందంటున్నారు. పాఠశాల ప్రాంగణాలు మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలకు యత్నం

సంజీవనగర్, బాబానగర్ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో ఖాళీ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేశారు. విలువైన పాఠశాలల స్థలాలపై కొందరు ప్రైవేటు వ్యక్తుల కన్ను ఇంకా ఉన్నది. అయితే మన ఊరు-మన బడి కింద సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ మంజూరైనా ఇతరత్ర కారణాలతో పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఆయా ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కల్పించేలా ప్రహరీ గోడలను నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కంపౌండ్‌వాల్ మంజూరు చేయాలి

తమ పాఠశాలకు కంపౌండ్‌వాల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కంపౌండ్‌వాల్ నిర్మించాలని పలుమార్లు ప్రజావాణిలోనూ అర్జీ పెట్టాను. ఎటువంటి స్పందన లేదు. జిల్లా ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కంపౌండ్‌వాల్ మంజూరుకు చర్యలు తీసుకోవాలి.

-మనోహర్, బాబానగర్ స్కూల్ హెచ్‌ఎం, సంగారెడ్డి

యూరియా బాధలు

వర్షంలోనూ దుకాణాల ఎదుట నిరీక్షణ

రైతుల బారులు

వరుస వర్షాలతో పెరిగిన డిమాండ్

తగినంత అందుబాటులో ఉంచడంలో

యంత్రాంగం విఫలం

చేతులెత్తేసిన వ్యాపారులు, అధికారులు



పాలమాకుల సొసైటీ వద్ద క్యూలైన్‌లో చెప్పులు ఉంచి వేచి చూస్తున్న రైతులు

సంగారెడ్డి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓవైపు సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో యూరియా వినియోగం అత్యవసరమైంది. సరిపడా నిల్వలు లేకపోవడంతో రైతులకు ఒకట్రెండు బస్తాలు అంటగట్టి వ్యాపారులు చేతులు దులుపుకుంటున్నారు. సరిపడా యూరియా రాలేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో, అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాల్లో వారం రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ఈ సమయంలో యూరియా చల్లాల్సి ఉంటుంది. పంటల పచ్చదనంతోపాటు మొక్కల ఎదుగుదలకు యూరియా అవసరం ఉంది. కానీ ఇందుకు సరిపడా యూరియా నిల్వలను జిల్లాలకు తెప్పించడంలో విఫలమయ్యారు. సంగారెడ్డి జిల్లాలో యూరియా నిల్వలపై ఎప్పటికప్పుడు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండడం వల్ల అంతగా సమస్యలు ఉత్పన్నం కావడం లేదు. సిద్దిపేట, మెదక్ జిలాల్లో అధికారులు విఫలమవడంతో అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు.

భారీ వర్షంలోనూ తప్పని తిప్పలు

భారీ వర్షానికి సైతం వెరవకుండా రైతులు యూరియా కోసం బారులు తీరుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లాలో

మిగతా 7వ పేజీలో



చేగుంటలో భారీ వర్షంలోనూ యూరియా కోసం రైతుల నిరీక్షణ



వెల్దుర్తి సొసైటీ వద్ద రైతుల క్యూలైన్

ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

ఉమ్మడి మెదక్ జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు లేవని, అప్రమత్తం కాకుంటే రైతులు రోడ్డెక్కే పరిస్థితి నెలకొంటుందని ఈనెల 4న 'యూరియా కావాలయ్యా' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం యూరియాపై దృష్టి పెట్టాలని సూచించడం జరిగింది. కానీ ఆశించినస్థాయిలో నిల్వలు దిగుమతి కాలేదు. ఫలితంగా ఈ పరిస్థితి తలెత్తింది.

యూరియా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	అవసరం	కేటాయింపు
సంగారెడ్డి	36,780	29,892
సిద్దిపేట	40,000	20,896
మెదక్	26,000	19,000

వానొచ్చే.. వరదొచ్చే

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు

మంజీరా నదికి వరద ప్రవాహం

'సింగూరు' ఐదు గేట్ల నుంచి నీటి విడుదల

అలుగు పారుతున్న ఘనపురం, పోచారం

పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

పలు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం



కొల్చారం : పొంగిపొర్లుతున్న ఘనపురం వనదుర్గా ప్రాజెక్టు



వెల్దుర్తి: అలుగుపారుతున్న కుకునూర్ చెక్‌డ్యామ్

సంగారెడ్డి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని వాగులు పొంగిపొర్లుతుండగా చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు అలుగు పారుతున్నాయి. సింగూరు ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా పుల్కల్, చౌటకూరు మండలాల్లో 80మి.మీల వర్షపాతం నమోదుకాగా మెదక్ జిల్లా టేక్మాల్, శివ్వంపేట, పెద్ద శంకరంపేట, నర్సాపూర్, మనోహరబాద్ మండలాల్లో 60 నుంచి 100 మి.మీల వర్షపాతం నమోదైంది. ఇక సిద్దిపేట జిల్లాలోనూ గడిచిన 15 రోజుల్లో 84మి.మీల సగటు వర్షపాతం కురిసింది.

- నర్సాపూర్: పట్టణంలోని 7, 9 వార్డుల్లో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యటించారు. వంట కాలువ చెత్తాచెదారంతో నిండిపోవడాన్ని గమనించి, చెత్తను తొలగించి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విగ్నేశ్వరకాలనీని పరిశీలించి వరద సమస్య పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. అనంతరం నర్సాపూర్ చెరువును మెదక్ ఎస్పీ పరిశీలించారు.
- అల్లాదుర్గం, పెద్దశంకరంపేట మండలాల్లో చెరువులు అలుగు పారుతున్నాయి. వరి పొలాలు నీటిలో కొట్టుకుపోయాయి.
- మనోహరాబాద్ మండలంలో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. పోలీస్‌స్టేషన్ వెళ్లే రోడ్డుపై వరద నీరు నిలిచింది. కోనాయపల్లిలో రెండు ఇళ్లు కూలిపోయాయి.
- వెల్దుర్తి మండలంలో జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. వెల్దుర్తి, ఉప్పులింగాపూర్, కుకునూర్, దామరంచ చెక్‌డ్యామ్‌లు, హస్తాల్‌పూర్ చెరువు, ఆరెగూడెం రాంశెట్టి చెరువు అలుగు పారుతున్నాయి.
- హవేళిఘణపూర్ మండలంలోని పోచారండ్యాం పొంగిపొర్లుతోంది. ప్రాజెక్టును చూసేందుకు పర్యాటకులకు అనుమతి లేదని, దారిని మూసివేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. దూప్‌సింగ్ తండా బ్రిడ్జి పూర్తికాకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మంజీరా నదిపై ఉన్న కూచన్‌పల్లి, సర్దన చెక్‌డ్యాంలు పారుతున్నాయి.
- నారాయణఖేడ్ మండల పరిధిలోని గంగాపూర్ ప్రాజెక్టు పొంగిపొర్లడంతో మన్సూర్‌పూర్ వాగు పైనుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నారాయణఖేడ్-ఖాంజీపూర్ మధ్య లోలెవల్ కాజ్‌వే కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయి. ఎమ్మెల్యే సంజీవరెడ్డి కాజ్‌వేను పరిశీలించారు.

ఉమ్మడి జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లా	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షం
సిద్దిపేట	375.1 మి.మీ	491.0 మి.మీ
సంగారెడ్డి	408.7 మి.మీ	461.2 మి.మీ
మెదక్	423.1 మి.మీ	507.1 మి.మీ

- మనూరు మండలం కమలాపూరు చెరువు, గట్‌లింగంపల్లి ప్రాజెక్టు అలుగు పారాయి.
- సంగారెడ్డి మండలంలోని మంజీర డ్యామ్‌తో పలు చెరువులను ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ (నంబర్ 8712656739)కు ఫోన్ చేయాలని సూచించారు. చెరువులు, కుంటలు చూడటానికి వెళ్లకూడదని, వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు.



నారాయణఖేడ్ : ఖాంజీపూర్ కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నర్సాపూర్‌లో పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



మనూరు : అలుగు పారుతున్న తిమ్మాపూర్ చెరువు



తెరుచుకున్న సింగూరు ప్రాజెక్టు గేట్లు

మంజీర ఉగ్రరూపం.. సింగూరుకు వరద

పుల్‌కల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో మంజీర నది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్నది.సింగూరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నది. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 31,412 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 43,634 క్యూసెక్కులుగా నమోదైంది. భారీగా వరద వస్తుండటంతో 6, 8, 9, 10, 11 నంబర్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. మహారాష్ట్రలోని లాతూర్, బీడ్, ఉస్మానాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ నీరంతా చిన్నచిన్న వాగులు, వంకల గుండా మంజీర నదిలోకి చేరుతున్నది. దీంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉండటంతో 21 టీఎంసీల కంటే తక్కువగా నీటిని నిల్వ చేస్తున్నారు. ఆనకట్ట లోపలి భాగంలో రివిట్‌మెంట్ దెబ్బతిన్న ప్రాంతంలో నీటి అలల ఉధృతి అధికంగా ఉన్నది. వరద ప్రవాహం అంతకంతకు పెరుగుతుండటంతో నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు వద్దనే రాత్రింబవళ్లు ఉంటూ జల ప్రవాహాన్ని అంచనా వేస్తున్నారు. సింగూరుకు దిగువన కలబ్‌గూర్ వద్ద ఉన్న మంజీర జలాశయం గేట్లను కూడా ఎత్తారు. 6, 7, 8 క్రస్ట్‌గేట్లతో పాటు ఒక స్కవర్ గేట్‌ను మంజీర వరద నీటిని ఎత్తి దిగువ ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

జలదిగ్బంధంలోనే దుర్గమ్మ ఆలయం



ఏడుపాయల వనదుర్గ మాత ఆలయాన్ని ముంచెత్తుతున్న మంజీరా ప్రవాహం

పాపన్నపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకైక మధ్యతరహా ప్రాజెక్ట్ అయిన ఘనపూర్ ఆనకట్టకు సింగూరు నుంచి పెద్దఎత్తున వరద నీరు రావడంతో పొంగిపొర్లుతున్నది. ఆనకట్ట దిగువన ఏడుపాయలు వరదవల్ల తొక్కుతున్నాయి. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం జలదిగ్బంధంలో ఉండడంతో మూడో రోజు శనివారం కూడా రాజగోపురంలోనే నిత్య పూజలు నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్ ఘనపురం ఆనకట్ట, ఏడుపాయలను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రవాహం వైపు సందర్శకులు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

యూట్యూబ్ చూసి దొంగతనాలు

మెదక్ అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఈజీ మనీకి అలవాటు పడిన ముగ్గురు స్నేహితులు బ్యాంకులు, ఏటీఎంలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. చోరీలు ఎలా చేయాలో యూట్యూబ్‌లో వీడియోలు చూసి నేర్చుకున్నారు. ఈ నెల 7న మెదక్ పట్టణంలోని ఆటోనగర్ ఎస్‌బీఐ బ్యాంకులో దొంగతనానికి యత్నించిన కేసులో ముగ్గురు దొంగలను అరెస్టు చేసి విచారించగా.. పలు చోట్ల చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. వెల్దుర్తి మండల పరిధిలోని మానేపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, లింగం, ప్రసాద్ ముగ్గురు కలిసి గత జూన్‌లో గుమ్మడిదల ఎక్స్ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎం వద్దకు వెళ్లి ట్రాక్టర్‌కు తాడు కట్టి దొంగతనం చేయడానికి యత్నించారు. అలారం మోగడంతో అక్కడి నుంచి పారిపోయారు. జూన్ 30న వెల్దుర్తిలోని సెంట్రల్ బ్యాంకు గోడను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి, చోరీకి ప్రయత్నించగా.. అలారం మోగింది. దాంతో దొంగలు పారిపోయారు. ఈనెల మొదటి వారంలో గుమ్మడిదలలోని భవానీ వైన్స్ గోడకు రంధ్రం చేసి లోనికి వెళ్లి మద్యం బ్యాటిళ్లతోపాటు రూ. 15 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈనెల 7న మెదక్ పట్టణంలోని ఆటోనగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులోకి వెళ్లి లాకర్ గోడను పగలగొట్టేందుకు ప్రయత్నించి విఫలం కావడంతో వెళ్లిపోయారు. అదే రోజు కౌడిపల్లిలోని వైన్స్ షాపుకు రంధ్రం చేసి మద్యం బాటిళ్లు దొంగతనం చేశారు. ఆయా కేసుల్లో నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుత్తి, గడ్డపార, శానాం, తాడు, సంచులు, బైకులు, ట్రాక్టర్, రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. పేరూర్ గ్రామానికి చెందిన షఫ్రొద్దీన్ ఈనెల 4న గోల్కొండ కాలనీలో పార్కు చేసిన ఆటోను ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసుల సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా డిచ్‌పల్లి శివారులో ఆటోను గుర్తించారు. దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులను ఛేదించిన పట్టణ సీఐ మహేష్, ఎస్సై అమర్, కౌడిపల్లి ఎస్సై రంజిత్ రెడ్డి, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

చేర్యాలలో క్షుద్రపూజల కలకలం


దుకాణ ఆవరణలో చేసిన క్షుద్రపూజ

చేర్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు చేర్యాల పట్టణంలో కలకలం రేపింది. మండలకేంద్రానికి చెందిన గాజుల నాగరాజు స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. రోజూవారీలాగే శుక్రవారం రాత్రి షాపుమూసి వేసి షటర్‌కు తాళంవేసి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం షాపు తెరవడానికి వచ్చిన అతడికి షాపు ఆవరణలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కోడిగుడ్డు, నలుపురంగు బొమ్మ, అన్నం మధ్యన నాగరాజు దంపతుల ఫొటో కనిపించడంతో ఖంగుతిన్నాడు. క్షుద్ర పూజలు చేశారని అర్థమై చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయం అంతటా వ్యాపించడంతో చుట్టుపక్కలవారితో పాటు స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

కస్టమర్‌కేర్ అనుకుని కాల్..
80వేలు పోగొట్టుకున్న యువకుడు

నర్సాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌కు చెందిన ఖలీల్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో వస్తువు కొనుగోలు చేశాడు. అది రాకపోవడంతో వెబ్‌సైట్‌లో నెంబరు చూసి ఫోన్ చేయగా వారు మోసం చేసి ఫోన్‌లో ఉన్న సుమారు 80వేల రూపాయలు కాజేసిన వైనం చోటు చేసుకుంది. శనివారం ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌లో చిరువ్యాపారం చేసుకుని జీవించే ఖలీల్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో వస్తువు కొనుగోలు చేయగా అది రాకపోవడంతో వెబ్‌సైట్‌లో ఉన్న నెంబరుకు ఫోన్ చేసి విషయం చెప్పగా మళ్లీ అప్‌డేట్ చేయాలి మీ వివరాలు అని చెప్పగా వివరాలు చెప్పిన తర్వాత ఫోన్‌కి వచ్చిన ఓటీపీకి ఓకే చేశాడు. అంతే పలుమార్లు అతడి అకౌంట్‌లో ఉన్న మొత్తం సుమారు రూ.78,294 ఖాళీ చేశారు. అనుమానం వచ్చి అకౌంట్‌లో బ్యాలెన్సు చూడగా విషయం బయటపడటంతో 1930సైబర్‌క్రైంకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్యాంకుపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలిద్దరు గొడవపడి భర్త ఓవర్‌హెడ్ ట్యాంకుపై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డిజిల్లా మొగుడంపల్లి మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణ(35) తాగినమైకంలో కుటుంబ సభ్యులతో గొడవపడి శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం కోల్కుందకు చెందిన క్రిష్ణ కొంతకాలంగా భార్య సత్యమ్మతో కలిసి మొగుడంపల్లి మండలంలోని గుడిపల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. అతడు మద్యానికి బానిస కావడంతో భార్య, కుటుంబసభ్యులు పలుమార్లు తాగొద్దంటూ మందలించినా మార్పురాలేదు. శుక్రవారం రాత్రి తాగినమత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవపడాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంపక్కనే ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు ఎక్కి కిందకు దూకాడు. దీంతో గ్రామస్థులు, కుటుంబీకులు జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. భార్య సత్యమ్మ ఫిర్యాదుమేరకు మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేందర్‌రెడ్డి అన్నారు.

కుమారుడితో సహా గృహిణి అదృశ్యం


రాథోడ్‌శాంతాభాయి (ఫైల్)

పటాన్‌చెరు ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సొంత గ్రామంలో పని చేసుకొని బ్రతుకుతామంటూ ఓ గృహిణి కుమారుడుతో అదృశ్యం అయింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ శాంతాబాయి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో ఇద్దరు కుమారులతో నివాసం ఉంటుంది. భర్త రవి రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లి పని చేసుకుంటున్నాడు. గత నెల 27న తెల్లవారు జాము సమయంలో సొంత గ్రామంలో పని చేసుకుని బ్రతుకుతామంటూ ఇంటి యజమానికి చెప్పి ఇల్లు ఖాళీ చేసి కుమారుడు నితిన్‌తో కలిసి అదృశ్యం అయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించినా ఫలితం లేకపోవడంతో శనివారం అక్క లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సింగూరుకు పర్యాటకుల తాకిడి





పుల్కల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో శనివారం పర్యాటకుల సందడి పెరిగింది. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం, శనివారం కృష్ణాష్టమి, ఆదివారం సెలవులు కావడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రాజెక్టును చూడటానికి వచ్చారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల పట్టణాల నుంచి వాహనాల్లో వచ్చారు. పర్యాటకులు ప్రాజెక్టుపైకి వెళ్లడానికి అనుమతి లేకపోవడంతో మంజీర నదిపై వంతెన వద్ద నిలబడి దిగువకు వెళ్తున్న వరద నీటిని చూసి ఆనందించారు. వంతెనపై నిలబడి సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ప్రవాహం పెరగడంతో మరిన్ని గేట్లు ఎత్తినట్లు అధికారులు తెలిపారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ ప్రాజెక్టును సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పర్యాటకులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేదిలేదన్నారు.

దుకాణాల్లోనే సిట్టింగ్..

ప్రాజెక్టు వద్ద చేపల ఫ్రై దుకాణాలు కిటకిటలాడాయి. సింగూరు చేపలు ఇష్టపడే పర్యాటకులు అక్కడే చేపలు కొనుగోలు చేసి వేయించుకుని తిన్నారు. కొన్ని దుకాణాల్లో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నారని, అధిక ధరలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. చేపల షాపుల దుకాణాల్లోనే సిట్టింగ్ ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేస్తున్నారు.



మొక్కజొన్న కంకుల వద్ద పర్యాటకులు









మన్‌సాన్‌పల్లి రూటే సపరేటు!

దశాబ్దాలుగా మౌలిక వసతులు కరువు

● తాగడానికి సురక్షిత నీరు లేదు.. కరెంట్ సరఫరా సరిగా ఉండదు
● బస్సు సౌకర్యమూ కల్పించని వైనం

కొండాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడిచినా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా ఇప్పటికీ సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామానికి కనీస సౌకర్యాలు అందని దుస్థితి నెలకొంది. ఏళ్ల కొద్ది తాగునీరు, విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. విద్యాభ్యాసం, బస్సు రవాణా తదితర అవసరాలకు జిల్లా, మండల కేంద్రాలకే వెళ్లాల్సి వస్తున్నది. గ్రామానికి ఇప్పటి వరకు నేరుగా బస్సు సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. రాష్ట్ర రాజధానికి వెళ్లే దారి పక్కనే, మహానగరానికి కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఈ గ్రామానికి వసతులు అందడం లేదు.

నీళ్లు, కరెంట్, బస్సు సౌకర్యాలు నిల్

జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్లు, మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామానికి ఉత్తరాన హైదరాబాద్ వెళ్లే రోడ్డు ఉంది. గ్రామంలో 368 కుటుంబాలు, 984 ఓటర్లు, 1500 జనాభా ఉన్నారు. 365 ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు, 84 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గ్రామంలోని వ్యవసాయ భూములకు విపరీతమైన ధర ఉన్నప్పటికీ, ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలు అందడంలేదు.

ఈ దారే సపరేటు

మన్‌సాన్‌పల్లి నుంచి మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ముందుగా హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిని, రెండు కిలోమీటర్ల మేర రంగారెడ్డి జిల్లా సరిహద్దులను దాటాల్సిందే. ఇప్పటి వరకు గ్రామం నుంచి మండల కేంద్రంలోని గ్రామాలను కలుపుతూ జిల్లా కేంద్రానికి బస్సు రవాణా సౌకర్యం కల్పించలేదు. రైతులు వ్యవసాయ విత్తనాలు, మందులు, ఎరువులకు, బ్యాంక్ రుణాలకు, మహిళా సంఘాల సభ్యులు మండల కేంద్రానికి తప్పనిసరిగా రావాల్సిన పరిస్థితి. మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం నడవాలి లేదా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది.

ఏళ్లుగా సురక్షిత నీటికి పడిగాపులు

ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన మంజీరా నీటి పథకం, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత మిషన్ భగీరథ పథకాలు ఇంతవరకు గ్రామానికి అందలేదు. వికారాబాద్ జిల్లాకు సరఫరా అయ్యే కృష్ణానది జలాల పైపులైన్ ఈ గ్రామ పరిసరాల నుంచే వెళుతోంది. రెండు కిలోమీటర్ల దూరంలో కృష్ణా జలాల లిఫ్టింగ్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ సైతం అందుబాటులో ఉంది. అయినా గ్రామానికి చుక్క నీరు అందని పరిస్థితి.

విద్యుత్ సరఫరాలో అంతరాయం..

గ్రామంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండటం లేదు. గ్రామానికి సంబంధించిన ఒక కనెక్షన్ కూడా మండల, జిల్లా పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అందడం లేదు. ఇంటి అవసరాలకు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి నుంచి, వ్యవసాయానికి నవాబ్‌పేట, మొమినాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అవుతుండగా, బిల్లులు మాత్రం కొండాపూర్ విద్యుత్ అధికారులు వసూలు చేస్తారు. దీంతో సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు ఒకరిపై ఒకరు సాకులు చెప్పడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పేరుకే నిరంతర విద్యుత్ సరఫరా ఉందని, రాత్రి, పగలు అనే తేడా లేకుండా రెండు మూడు రోజుల పాటు విద్యుత్ ఉండటం లేదని, బిల్లులు మాత్రం పక్కాగా వసూలు చేస్తున్నారని మాజీ సర్పంచ్ అనిత నర్సింహులు తెలిపారు. మంజీరా, మిషన్ భగీరథ నీటి కోసం రూ. 2 లక్షల సొంత నిధులు ఖర్చు చేసి పైపులు వేసినా ప్రయోజనం లేకుండా పోయిందని మరో మాజీ సర్పంచ్ వెంకటమ్మ తెలిపారు.

చెరువుల చెంత పైలం

● ఈత సరదా కారాదు విషాదం ● లైఫ్ జాకెట్‌లు వాడటం ఉత్తమం ● ఒంటరిగా ఈతకు వెళ్లకూడదు





మెదక్ కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులకు జీవకళ వచ్చింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని పోచారం అభయారణ్యం పక్కనే ఉన్న పోచారం ప్రాజెక్టు నిండు కుండలా మారింది. దీంతో సెలవులు దొరికితే చాలు విద్యార్థులు, పెద్దలు చాలామంది చెరువులు, ప్రాజెక్టుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడే రోజంతా సరదాగా ఆటపాటలతో గడిపేస్తూ విందు భోజనాలు చేస్తున్నారు. ఈ ఆనందాల వెనుక ప్రమాదం పొంచి ఉన్నది. ఈతకు వెళ్లి గల్లంతవడం, వరదలో కొట్టుకుపోవడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ తరుణంలో కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.

మద్యం సేవించి ఈతకు వెళ్లకూడదు...

నీటి వద్దకు వెళ్లేటప్పుడు గానీ, ఈత కొట్టేటప్పుడు గానీ మద్యం సేవించి ఉండకూడదు. నీరు ఎక్కువ లోతు లేకపోయినప్పటికీ ఆల్కాహాల్ సేవించి వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చల్లని నదులు లేదా ప్రవాహాలలో ఈత కొట్టకూడదు.

లైఫ్ జాకెట్‌ను ధరించాలి...

ఈత కొట్టాలనుకున్నప్పుడు కచ్చితంగా లైఫ్ జాకెట్‌ను ధరించడం మంచిది. పిల్లలైనా, పెద్దలైనా లైఫ్ జాకెట్ ఉండేలా చూసుకోవాలి.

ఒంటరిగా వద్దు..

ఒంటరిగా ఈత కొట్టకూడదు. ఈత తెలిసిన వారు మీ బృందంలో ఉండాలి. లైఫ్ గార్డు ఉన్న నిర్దేశిత ఈత ప్రాంతాలలో మాత్రమే ఈత కొట్టాలి. ఎక్కువ దూరానికి గానీ, ఎక్కువ లోతులో ఈత కొట్టడానికి ప్రయత్నించకండి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

వీలైనంత వరకు కొత్త చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు, బావులలో ఈత కొట్టకపోవడమే ఉత్తమం. తప్పనిసరిగా ఈత వచ్చిన వారే ఈతకు వెళ్లాలి. ఈత మానేసిన చాలా రోజుల తర్వాత ఈత కోసం దిగకూడదు, దీంతో దమ్ము, ఆయాసంతో ఊపిరి ఆడదు. ఈత కోసం దిగే వారు అక్కడి లోతు తదితర విషయాల పట్ల పూర్తి అవగాహన ఉంటేనే దిగాలి. ఈత కోసం దిగితే నీటి ఒడ్డున ఒకరు ఉండేలా చూసుకోవాలి. ఈత కోసం వాడే గాలి ట్యూబ్‌లు, తదితర పరికరాలు వాడటం మంచిది. ఎత్తైన ప్రదేశం నుండి నీటిలో దూకడం లాంటివి చేయకూడదు.

ఇతరులను కాపాడేటప్పుడు.

ఒకవేళ ఎవరైనా నీటిలో మునిగిపోతుంటే వారికి చేతులు అందించకూడదు. ఏదైనా తాడు, కర్ర వంటి వాటితో కాపాడే ప్రయత్నం చేయాలి. గాలంతో చేపలు పట్టే వారు గాలం చిక్కుకుందని నీటిలో దిగడం లాంటివి చేయకూడదు. అక్కడ లోతుగా ఉన్నట్లయితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.

శ్రీవారి ఆలయం వద్ద భక్తుడికి గుండెపోటు

● సీపీఆర్ చేసి కాపాడిన కానిస్టేబుల్

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఓ కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించి సీపీఆర్ చేసి ఓ భక్తుడిని రక్షించారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా మామిడిపల్లికి చెందిన మేడం శ్రీనివాసులు(61) కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనానంతరం రాత్రి 9.30 గంటల సమయంలో లడ్డూలు కొనుక్కుని మ్యూజియం వైపు వస్తున్న క్రమంలో వడమర మాడవీధిలో చాతీనొప్పితో కుప్పకూలిపోయారు. అక్కడే విధుల్లో ఉన్న తిరుమల వన్‌టౌన్ కానిస్టేబుల్ గుర్రప్ప ఆయనకు సీపీఆర్ చేయడంతో కోలుకున్నారు. వెంటనే అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

గజ్వేల్ రేక్ పాయింట్‌ను పునరుద్ధరించాలి

● ఇక్కడి యూరియా కోటాను హుస్నాబాద్‌కు మళ్లించారు
● సరిపడా అందించకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తాం
● ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ రేక్ పాయింట్‌ను పునరుద్ధరించి రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతాంగానికి యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ వద్ద రాజీవ్ రహదారిపై శనివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రేక్ పాయింట్‌ను తొలగించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. గజ్వేల్ యూరియా కోటాను హుస్నాబాద్‌కు తరలించారని విమర్శించారు. రైతుల సమస్యలపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఇతర ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గజ్వేల్‌లో రేక్ పాయింట్‌ను పునరుద్ధరించకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ధర్నా జరుగుతున్న స్థలానికి వచ్చిన సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి మాట్లాడుతూ, గజ్వేల్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎక్కడా తరలించలేదని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ధర్నా విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళీ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా, రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, డీసీసీబీ డైరెక్టర్ భట్టు అంజిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, ఊడెం కృష్ణారెడ్డి, మాదాసు శ్రీనివాస్, జకీ, నవాజ్‌మీరా, రమేష్, దుర్గయ్య, నూనె కుమార్, దేవి రవీందర్, దుర్గాప్రసాద్, బొల్లారం ఎల్లయ్య, వంగ మల్లేశం, యాదగిరి, లక్ష్మణ్‌రాజు, కోల సద్గుణ, అత్తెల్లి శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, అహ్మద్, కనకయ్య, కొల్గూరు స్వామి, నరేశ్‌గౌడ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.



ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



చేగుంటలో రైతు ఆగ్రో సేవా కేంద్రం వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో రైతులు

యూరియా బాధలు.. రైతుల బారులు

(5వ పేజీ తరువాయి)

నెలకొన్నది. కొన్నిచోట్ల ఉదయం 5 గంటల నుంచే ఎరువుల దుకాణాలు, సొసైటీల ఎదుట రైతులు తమ చెప్పులను క్యూలైన్లలో ఉంచుతున్నారు. వర్షాలు లేని చోట స్వయంగా రైతులే గంటల తరబడి నిల్చుంటున్నారు. ఆధార్ కార్డు, పాస్‌బుక్ ఆధారంగా ఎకరాకు ఒకటి లేదా రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. కొన్ని చోట్ల ఒక్కో యూరియా బస్తాపై రూ.50 నుంచి రూ.100దాకా వసూలు చేస్తున్నారు. వర్షం ఎత్తిపోతే యూరియాతో ఉపయోగం ఉండదని భావించి ఈ సమయంలోనే యూరియా కోసం శ్రమిస్తున్నారు.

అలస్యమైతే అంతేసంగతి..

యూరియా చల్లడం ఆలస్యమైతే పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అందుకే యూరియా కోసం ఆరాటపడుతున్నారు. కాగా యూరియాపై రైతులకు సరైన అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం ఉంది. విడతల వారీగా యూరియా వస్తుందని, కృత్రిమ కొరత లేదని స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. అందుకే వరి పంటకు రెండో దఫా యూరియా వినియోగం కోసమూ ఇప్పటి నుంచే రైతులు తీసుకెళ్తున్నారు. ఫలితంగా ఈసారి యూరియా అవసరం ఉన్నవారికి నిరాశ తప్పడం లేదు. ఇలాంటివాళ్లే రోడ్డెక్కుతూ ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు యూరియా చల్లకుంటే పంటలు ఎర్రబారుతాయని, దిగుబడి తగ్గుతుందని ఎవరికివారే రైతులు భావిస్తున్నారు. ఇందులో నిజానిజాలపై అధికారులు చైతన్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్యూలో పడిగాపులు

చేగుంట/ వెల్దుర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియా అవసరముండటంతో చేగుంట రైతు ఆగ్రో సేవా కేంద్రం, ఇబ్రహీంపూర్ సొసైటీ వద్ద శనివారం రైతులు క్యూలైన్లలో నిల్చున్నారు. చేగుంటలోని శ్రీ ఆంజనేయ ఆగ్రో సేవా కేంద్రానికి 225 బ్యాగులు, ఇబ్రహీంపూర్ సొసైటీకి 560 బ్యాగుల యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న చేగుంట చుట్టుపక్కల గ్రామాలు, ఇబ్రహీంపూర్ సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు ఉదయం నుంచే కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే వెల్దుర్తిలోని సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం క్యూలైన్లలో నిలబడ్డారు. రైతుల పట్టా పాసుపుస్తకాలు పరిశీలించి వారికి సరిపడా యూరియా బస్తాలను విక్రయించినట్లు సొసైటీ సీఈఓ అశోక్ తెలిపారు. మండలంలో 560 బస్తాల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

● ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర్

మెదక్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులు గెలిచేందుకు నాయకులు, కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించాలని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్(ఆర్‌జీపీఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల సిద్దేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం మెదక్‌లోని ఓ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీని బలోపేతం చేయడానికి గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ కోరారు. కంప్యూటర్ విప్లవం తెచ్చింది రాజీవ్ గాంధీ అని తెలిపారు. సంఘటన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సుభాష్ యాకరణ్ మాట్లాడుతూ జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ఆర్‌జీపీఆర్ఎస్ నిర్మాణంతో లక్ష్యాన్ని సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కిరణ్ ముగబాసే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, టీపీసీసీ నాయకులు సుప్రభాత్‌రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ మహేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, యువజన కాంగ్రెస్ నేత బొజ్జ పవన్ కుమార్ సమీయొద్దీన్, గూడూరి శంకర్, గూడూరి క్రిష్ణ, హఫీజొద్దీన్, లక్ష్మీనారాయణ్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాచమల్ల సిద్దేశ్వర్


సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి గణేశ్‌నగర్‌లోని శ్రీకృష్ణాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూజలు


మునిపల్లి : యునైటెడ్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు


కందిలో గోపిక, శ్రీకృష్ణ వేషధారణలో అలరిస్తున్న సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


మెదక్ అర్బన్: డోలారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక అలంకణ గావించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

- న్యూస్ నెట్‌వర్క్


కోహీర్ శిశుమందిర్‌లో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో విద్యార్థులు


సంగారెడ్డిలో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారుడు


పాపన్నపేట : నార్సింగి శ్రీసాయి స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు


పెద్దశంకరంపేటలో శ్రీకృష్ణ తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

ఘనంగా అటల్ బిహారీ వాజ్‌పాయ్ వర్ధంతి

మెదక్ అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి దేశాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఎల్ఎన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్టేడియంలో ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం క్రీడా ఎంపికలు నిర్వహించారు. అండర్-15 బాల, బాలికలకు జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపికలు నిర్వహించారు. ఆదేవిధంగా 'సుబ్రతో ముఖర్జీ' పేరిట అండర్-17 బాలుర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. జిల్లాస్థాయికి ఎంపికైన టీమ్‌కు ట్రోఫీని అందజేశారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన క్రీడా ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కిష్టయ్య, అమూల్యమ్మ, సుభాష్‌గౌడ్, శివకుమారి పాల్గొన్నారు.

'పత్తిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి'

టేక్మాల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు అధికంగా కురుస్తున్నందున పత్తి, వరి పంటల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాంప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని బొడ్మట్‌పల్లి, కాదులూరులో పత్తి, వరి పంటను పరిశీలించి, రైతులకు పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

పాలకులు మారినా పరిస్థితులు మారలే

నారాయణఖేడ్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పాలకులు మారినా గ్రామాలు, తండాల పరిస్థితి మారడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింలు అన్నారు. పల్లెబాటలో భాగంగా శనివారం మండల పరిధిలోని ఖాంజీపూర్‌తండాను సందర్శించారు. ఖాంజీపూర్ శివారులో అసంపూర్తిగా ఉన్న కాజ్‌వే పైనుంచి పారుతున్న వరదనీరు, తండాలోని అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ నిలిచిన వర్షపునీరు, పాడైన ప్రధాన అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు లేకపోవడం, తదితర విషయాలను పరిశీలించారు. ప్రభుత్వం వంతెనను నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

18న స్పాట్ అడ్మిషన్లు

జిన్నారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు జిల్లాలో గల గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 18న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలోని గురుకుల బాలబాలికల విద్యాలయాలలో 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న పరిమిత సీట్లకు జిన్నారం గిరిజన సంక్షేమ పాఠశాలలో 18న స్పాట్ అడ్మిషన్ల కౌన్సిలింగ్ జరుగుతుందని, ఆసక్తి గల వారు సంబంధిత విద్యా, కుల ధృవపత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

మూడురోజుల్లో నల్లవాగు ప్రాజెక్టు నీరు విడుదల

- కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపడతాం
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి


నల్లవాగు ప్రాజెక్టును పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నల్లవాగు ప్రాజెక్టులోకి ఆశినంత వరదనీరు చేరినందున ఆయకట్టు భూములకు మరో రెండు, మూడురోజుల్లో సాగునీరు విడుదల చేయిస్తామని, దీని కోసం యుద్ధప్రాతిపదికన కుడి, ఎడమ కాలువల్లో పూడిక పనులు చేపడతామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టును ఎమ్మెల్యే శనివారం సందర్శించి, వరదనీటిని పరిశీలించి మాట్లాడారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,493 అడుగులు కాగా.. శనివారం సాయంత్రం వరకు 1,488.5 అడుగులకు చేరుకుందని, ఇన్‌ఫ్లోగా 440 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు ఆయన తెలిపారు. మరో రెండురోజులు భారీ వర్షాలు ఉండటంతో ప్రాజెక్టు దాదాపుగా పూర్తిస్థాయిలో నిండిపోనుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ ఆధారంగా ఆయకట్టు భూములకు నీరు విడుదల చేయడానికి నీటిపారుదల శాఖ అధికారులకు సూచించామని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా కురియడం వలన బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, ఫలితంగా వేసిన వరి పంట ఎండిపోయే దశలో నల్లవాగు ప్రాజెక్టులో నీరు చేరడం సంతోషకరమన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఆయన వెంట నాయకులు శంకర్‌గుప్తా, పండరిరెడ్డి, సంగన్న, జయరాజ్, గంగారాం, సిర్గాపూర్ రెండవ ఎస్ఐ నారాయణ, నీటిపారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం ఆపండి

కల్హేర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని క్రిష్ణాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిల్వ ఉన్న నిధులను పాలకవర్గం అనవసర పనులకు ఖర్చుచేస్తూ.. దుర్వినియోగం చేస్తుందని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, రైతులు అన్నారు. ఈ విషయమై శనివారం జిల్లా సహకార శాఖ అధికారి(డీసీవో)కు ఫిర్యాదు చేశారు. క్రిష్ణాపూర్ ప్యాక్స్ సంవత్సరాల తరబడి కొనసాగుతున్నా ఏనాడూ రైతుల కోసం పని చేయలేదన్నారు. ప్రస్తుతం ధాన్యం, జొన్నల నిల్వ కోసం గోడౌన్ అవసరం ఉండగా.. అనవసరంగా ప్రహరీ నిర్మాణానికి పూనుకున్నారని, దీనికోసం నిధుల విడుదలకు అనుమతించవద్దని డీసీవోను కోరారు. అనంతరం నారాయణఖేడ్ డీసీసీబీ మేనేజర్‌కు ఫిర్యాదు అందజేశారు.

నమ్మండి.. ఇది పంట కాలువే..!


అధ్వానంగా నర్సాపూర్ పరిధిలోని రాయరావు చెరువు పంట కాలువ

నర్సాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పరిధిలోని రాయరావు చెరువు నుంచి సమీపంలోని పంటలకు నీరు వెళ్లేందుకు పట్టణంలోని పలు ఇళ్ల మధ్య కాలువ ఉంది. అయితే ఆ కాలువ ఇళ్ల సమీపంలో చెత్తాచెదారంతో పాటు పిచ్చిమొక్కలు పెరిగి నీరు వెళ్లలేక మురుగు కాలువగా మారింది. ఇందులో డ్రైనేజీ నీటితో పాటు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కూడా పేరుకుపోయాయి. కలెక్టర్ రాహుల్‌రాజ్ 7వ వార్డులో సందర్శించిన సందర్భంగా స్థానికులు కాలువ దుస్థితిని చూపి పరిష్కరించాలని కోరారు.

ఇంద్రేశం రోడ్డు మరమ్మతులు చేయాలి

పటాన్‌చెరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గుంతల రోడ్ల వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటోందని సీపీఎం పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఐనోలు, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల, రామేశ్వరంబండ గ్రామాల వారు గుంతల రోడ్డుపై ప్రయాణం చేయలేకపోతున్నారని వివరించారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఉదయాన్నే కార్యాలయాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డు వేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏరియా కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, ఆయన సోదరుడు నగేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు

నారాయణఖేడ్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఆయన సోదరుడు, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ జన్మదిన వేడుకలను శనివారం నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో అభిమానులు, కార్యకర్తల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, శంకరయ్యస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైద్యనాథ్‌పాటిల్, సాగర్‌షెట్కార్, కొండల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

విఠల్‌రెడ్డి గొప్ప నాయకుడు


మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆయా పార్టీల ముఖ్య నాయకులు

నర్సాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప నాయకుడు చిలుముల విఠల్‌రెడ్డి అని పలువురు నాయకులు కొనియాడారు. విఠల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నర్సాపూర్‌లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి మాట్లాడుతూ విఠల్‌రెడ్డి సీపీఐ నేతగా ఎన్నో పోరాటాలు చేయడమే కాకుండా మెదక్ జిల్లాలో వందలాది ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయడానికి కారణమైన గొప్ప నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శేషసాయిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ నగేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ ఆర్డీవో రమాదేవి


టేక్మాల్: గుండు వాగును పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

టేక్మాల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాల మూలంగా గుండువాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. శనివారం టేక్మాల్ మండలంలోని గుండు, కాలేవాగు ప్రాంతాలను సందర్శించారు. నీట మునిగిన రోడ్లు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని, చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో రియాజొద్దీన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

●**నర్సాపూర్** : నర్సాపూర్ మండలం ఖాజీపేటకు చెందిన మోత్కులకుంట భారీ వర్షానికి గండిపడిన విషయం తెలుసుకున్న ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ కుంట వద్దకు వెళ్లే దారి బురదమయంగా మారడంతో చెప్పులు లేకుండా అక్కడికి వెళ్లారు. అనంతరం గండిని పూడ్చే పనులను పరిశీలించి పొలాల్లోకి వచ్చిన నీటిని చూసి రైతులతో మాట్లాడారు.

●**హత్నూర** : మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని తహసీల్దార్ పర్వీన్‌షేక్ సూచించారు. శనివారం హత్నూర మండల పరిధి కొన్యాల, లింగాపూర్ గ్రామ శివారులోని మంజీరా పరీవాహక ప్రాంతాన్ని ఆమె ఎస్ఐ శ్రీధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

●**తూప్రాన్** : తూప్రాన్ సమీపంలో పొంగిపొర్లుతున్న హల్దీవాగును, మండలంలోని చెరువులు, కుంటలను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు కలిగినా 9666206665 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

●**రాయికోడ్** : రాయికోడ్ మండల పరిధిలోని కుసునూరు బ్రిడ్జిని ఆర్అండ్‌బీ ఈఈ నర్సింలు, డీఈ రవీందర్ శనివారం పరిశీలించారు. వీరివెంట మాజీ సర్పంచ్ సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

●**చిన్నశంకరంపేట**: చిన్నశంకరంపేట మండలంలోని ధర్మాజిపల్లి, సూరారం, జంగరాయి, జంగరాయి తండా తదితర గ్రామాలను తహసీల్దార్ మాలతి పర్యటించారు. ధర్మాజిపల్లి రహదారి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఆమెవెంట ఆర్ఐ రాజు పాల్గొన్నారు.


ఏడుపాయల్లో వరదలను పర్యవేక్షిస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

●**జహీరాబాద్** : జహీరాబాద్, మొగుడంపల్లి తదితర ప్రాంతాల్లో నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలను జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం రూరల్‌ఎస్ఐ కాశీనాథ్, పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా జాడిమల్కాపూర్ జలపాతాన్ని తిలకించేందుకు కర్ణాటక, తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలను రాకుండా హెచ్చరించామన్నారు. అలాగే రాయిపల్లి, నారింజ ప్రాజెక్టు, పొట్టిపల్లి-అల్గోల్ గ్రామాల మధ్య వాగులను పరిశీలించారు. అల్గోల్-పొట్టిపల్లి, భరత్‌నగర్-అల్గోల్ చౌరస్తా, బూచనెల్లి-గుణపూర్ గ్రామాల మధ్య రోడ్లపై వాగులు ప్రవహిస్తుండడంతో ఆయా రోడ్లను మూసేశామన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్
- జిల్లా కమిటీ నియామకం


నూతన జిల్లా కమిటీని సన్మానిస్తున్న మల్లేశంగౌడ్

మెదక్ అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ సూచించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలోనూతన కమిటీని నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా సంపసాని సురేష్, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బుచ్చేష్‌యాదవ్, శ్రీనివాస్, నాగరాజు, రాజేందర్, శంకర్, నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శులుగా కల్కి, నాగరాజు, మహేశ్వరి, భిక్షపతి, బాలరాజు, అశోక్, సత్యనారాయణ, కోశాధికారిగా అంజనేయులు, కార్యాలయ కార్యదర్శిగా సాయికిరణ్‌ను జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జడ్పీ సీఈవో

పెద్దశంకరంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నాలుగురోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. శనివారం సాయంత్రం పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షాకీర్ అలీ పాల్గొన్నారు.

కోహీర్‌లో కూలిన ఇల్లు


కోహీర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

కోహీర్/నాగల్‌గిద్ద/వట్‌పల్లి/వెల్దుర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కోహీర్ మున్సిపల్ పట్టణంలోని సికందర్‌వాడి కాలనీలో మోసినబేగంకు చెందిన ఇల్లు శనివారం సాయంత్రం వర్షానికి తడిసి కూలిపోయింది. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలిన ఇంట్లో తిండి గింజలు, బట్టలు, ఇతర వస్తువులు పూర్తిగా పాడైపోయాయి. బాధితురాలిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాగా కూలిపోయిన ఇంటిని ఆర్ఐ అశ్విన్ పరిశీలించారు. అలాగే నాగల్‌గిద్ద మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన తేజమ్మ ఇల్లు గోడ శనివారం కూలింది. ప్రభుత్వం తమకు ఇల్లు మంజూరు చేసేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆమె కోరారు. వట్‌పల్లి మండలంలోని ఉసిరికపల్లిలో పట్లోళ్ల సంగారెడ్డి ఇల్లు, గౌతాపూర్‌లో రాయపల్లి ఖాజామియా ఇళ్ల కూలింది. వెల్దుర్తి మండల పరిధిలోని మేల్లూరు గ్రామానికి చెందిన ఏర్పుల యాదమ్మ పెంకుటిల్లు పాక్షికంగా దెబ్బతింది. ఆర్ఐ నర్సింగ్ యాదవ్ పరిశీలించి పంచనామా నిర్వహించారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి


మాట్లాడుతున్న చుక్కా రాములు

పటాన్‌చెరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. శనివారం పటాన్‌చెరు శివారు కాండ్విక్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. 2007 నుంచి రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని అమలు చేయకపోవడం దారుణమని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, విష్ణు, గంగాధర్ పాల్గొన్నారు.

రాయరావు చెరువుకు ప్రత్యేక పూజలు


చెరువు వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తదితరులు

నర్సాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ ప్రాంతంలోనే అతి పెద్దచెరువు అయిన స్థానిక రాయరావు చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతున్నది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, మాజీ ఎంపీటీసీ నగేష్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్ తదితరులు అలుగు వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

రైతుల అభిప్రాయాలు లేకుండా నోటిఫికేషన్ తగదు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్



పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభిప్రాయాలు లేకుండా భూసేకరణ కోసం నోటిఫికేషన్ వేయడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శ్రామిక్‌భవన్‌లో ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిమ్జ్ భూసేకరణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అవలంబించిన తీరంతా ఒక్కటేనన్నారు. ఇప్పటికే వేల ఎకరాల భూసేకరణ చేపట్టారని, 2013 భూసేకరణ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. రైతుల అభిప్రాయాలతో సంబంధాలు లేకుండా వేసిన నోటిఫికేషన్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతులు కుమార్, నర్సింలు, తుల్జారాం, శంకర్, గోపాల్, నారాయణ, యూనస్, ఖైరాత్, దండు రాములు, ఆంజన్న, సంగన్న, అశోక్, రామప్ప, అంజద్, తదితరులు పాల్గొన్నారు.